చలపతిరావుకు ఇన్‌స్పైయిర్ అవార్డు



బోడుప్పల్: కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్స్‌లెన్స్ ఫౌండేషన్ 2024 సంవత్సరం ఇన్‌స్పైయిర్ అవార్డును బోడుప్పల్‌కు చెందిన గుడిపాటి వెంకట చలపతిరావు అందుకున్నారు. ఈమేరకు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన విద్యార్థులకు స్పేస్, టెక్నాలజీ అవగాహన, అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఇస్రో చైర్మన్ సోమనాథన్, మాజీ డీఆర్‌డీఏ చైర్మన్, రక్షణ మంత్రిత్వ శాఖ సలహాదారులు సతీష్‌రెడ్డి చేతులమీదుగా పొందారు. సంస్థకు చేస్తున్న సేవలను గుర్తించి తనకు ఈ అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా చలపతిరావు పర్యావరణ పరిరక్షణలో భాగంగా అంతరించి పోతున్న పక్షులు, పిచ్చుకలను కాపాడటంలో భాగంగా రైతులు పండించిన వడ్ల గింజల ధాన్యం గుత్తులను చైర్మన్ సోమనాథన్‌కు అందజేశారు. దీంతో ఆయన ఎంతో సంతోషించినట్లు చలపతిరావు వెల్లడించారు.

కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌లో సత్తాచాటిన విద్యార్థులు



బోడుప్పల్: సిన్యాప్స్ ఒలింపియాడ్ వారిచే నిర్వహించిన కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌లో బోడుప్పల్ నారాయణ విద్యా సంస్థ విద్యార్థులు సత్తా చాటినట్లు డీజీఎం గోపాల్‌రెడ్డి వెల్లడించారు. బోడుప్పల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థిని శ్రద్ధనాయుడు ఐఎస్ఎస్ఓ ఆల్ ఇండియా 14వ ర్యాంక్, 9వ తరగతి విద్యార్థి లలిత్‌రెడ్డి ఐఎస్ఈఓలో ఆల్ ఇండియా 6వ ర్యాంక్, ఐఎస్‌సీఓలో ఆల్ ఇండియా 14 ర్యాంక్ సాధించినట్లు వెల్లడించారు. విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికి తీయడం కోసం ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఉత్తమ ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఏజీఎం బాలపరమేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ సత్యవాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

జర్నలిస్టుకు చేయూత

మల్కాజిగిరి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన జర్నలిస్టుకు మల్కాజిగిరి ప్రెస్‌క్లబ్(518) చేయూత అందించింది. ఇటీవల రోడ్డు ప్రమాదంలో రాజుగౌడ్‌ను అనే రిపోర్టర్ చేతికి ఫ్యాక్చర్ అయింది. బాధితుడికి ప్రెస్‌క్లబ్ తరఫున సేకరించిన రూ.14,500లను అతడికి అందజేశారు. అధ్యక్ష, కార్యదర్శులు బాలరాజ్, విశాల్ మాట్లాడుతూ జర్నలిస్టులకు అండగా ఉంటామని, వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్నామన్నారు. సునీల్‌రెడ్డి, రవియాదవ్, మనోహర్, లవకుమార్, శివకుమార్, కుమ్మరి రాజు, శ్రీకాంత్, చావా శంకర్, పవన్, సంగమేశ్వర్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు

మల్కాజిగిరి: బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారం పడేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి సహకరించాలని శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్ తెలిపారు. ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లో బస్తీ ప్రణాళిక కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి ఫంక్షన్ హాల్ వద్ద ఉన్న బహిరంగ చెత్త ప్రదేశాన్ని అక్కడ నుంచి తొలగించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంటింటికీ చెత్త సేకరించే వారికి సహకరించి చెత్త అందజేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త పడేయడం వల్ల పరిసరాలు పాడైపోవడమే కాకుండా ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది యాదగిరి, రాములు, గిరి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని పండగలను అన్నదమ్ముల్లా జరుపుకోవాలి



ఉప్పల్ ఏక్‌మినార్ మజీద్ ఇఫ్తార్ విందులో పట్నం సునీతా మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు

ఉప్పల్: ఉప్పల్ ఏక్ మినార్ మజీద్‌లో బుధవారం నిర్వహించిన ఇఫ్తార్ విందుకు కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మధుయాష్కి, ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇఫ్తార్‌లు మత సామరస్యానికి ప్రతీక అన్నారు. రాష్ట్రంలో అన్ని మతాల వారు అన్నదమ్ముల వలె ఉంటారని, అన్ని పండగలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. గతంలో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో రేవంత్‌రెడ్డిని గెలిపించిన విధంగా తనను మీ సోదరిలా భావించి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఉప్పల్ సమస్యలు తన దృష్టిలో ఉన్నాయని, ప్రతి సమస్యను తాను స్వయంగా పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

పలువురి మద్దతు కోరిన సునీత మహేందర్‌రెడ్డి

పార్లమెంట్ ఎన్నికల్లో తనకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి గురువారం టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కందికంటి అశోక్ కుమార్ గౌడ్‌ను కలిసి మద్దతు కోరారు. ఉప్పల్ నేత మందముల పరమేశ్వర్‌రెడ్డితో కలిసి వచ్చిన వారు అశోక్ కుమార్ గౌడ్ ఇంట్లో భేటీ అయ్యారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. కార్యక్రమంలో తెల్కల మోహన్‌రెడ్డి, చెన్‌రెడ్డి రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిలో అల్ఫాజోలంతో పాటు నగదు స్వాధీనం

శామీర్‌పేట్: కిలో అల్ఫాజోలంతో పాటు నగదును జినోమ్‌వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం మేడ్చల్ ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం జినోమ్‌వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధి అచ్చాయిపల్లి చౌరస్తా వద్ద మేడ్చల్ ఎస్ఓటీ పోలీసులు ఓ కారును ఆపి తనిఖీ చేశారు. ఇందులో రూ.15 లక్షల విలువ గల (కిలో అల్ఫాజోలం)తో పాటు రూ.7,89,500 నగదు గుర్తించారు. ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బీఆర్‌ఎస్ జెండా లేకుండా చేస్తాం..

కబ్జాలు, అసైన్డ్ భూములను కొల్లగొట్టిన మల్లారెడ్డి

- త్వరలో ప్రభుత్వం వాటిని స్వాధీనం చేసుకుంటుంది
- మేడ్చల్‌లో గులాబీ జెండా మోసేవారు కరువు
- పెద్దఎత్తున నేతలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధం
- టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్



తోటకూర వజ్రేష్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ కీసర మండల ప్రధాన కార్యదర్శి సింగారం నారాయణ, దాడి ధర్మేందర్‌రెడ్డి తదితరులు



కీసర: మేడ్చల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ జెండా లేకుండా చేస్తామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర జంగయ్యయాదవ్ అన్నారు. కీసర మాజీ ఎంపీపీ రామారం సుజాతతో పాటు బీఆర్‌ఎస్ కీసర మండల ప్రధాన కార్యదర్శి సింగారం నారాయణ, చీర్యాలకు చెందిన దాడి ధర్మేందర్‌రెడ్డితో పాటు వివిధ పార్టీలకు చెందిన నేతలు పెద్ద ఎత్తున గురువారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కీసరలో నిర్వహించిన కార్యక్రమంలో తోటకూర వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గంలో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి చేసిన తప్పులను చూసి బీఆర్‌ఎస్ జెండా మోసే నాయకులు కనుమరుగవుతున్నారని విమర్శించారు. మల్లారెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో భూకబ్జాలు, అసైన్డ్, ప్రభుత్వ భూములను కొల్లగొట్టాడని ఆయన చేసిన కబ్జాలను ప్రభుత్వం త్వరలో స్వాధీనం చేసుకుంటుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజాపాలనకు ఆకర్షితులై పెద్ద ఎత్తున ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. స్థానికంగా ఉన్న బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులను, ప్రజాప్రతినిధులను తమ నాయకులతో చర్చించి పార్టీలో చేర్చుకుంటామన్నారు. ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో పట్నం సునీతా మహేందర్‌రెడ్డికి మేడ్చల్ నియోజకవర్గం నుంచి 50 వేలకు పైగా మెజార్టీ తీసుకువచ్చేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కీసర మండల అధ్యక్షుడు కృష్ణాయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సత్తిరెడ్డి, నేతలు జూపల్లి రవీందర్, చిక్కుడు రమేష్‌యాదవ్, మహేష్, తటాకం అభిలాష్, శ్రీనివాస్‌గౌడ్, హరిబాబు, రామిడి శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రామిడి స్వప్న, సత్తిరెడ్డి, జైహింద్‌రెడ్డి, కొల్కూరి సత్యనారాయణ, రామారం ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నెట్‌వర్క్‌ను మెరుగుపర్చుకోవాలి

ఐఈఈఈ చైర్ ప్రొఫెసర్ విజయలతరెడ్డి



సదస్సుకు అతిథిగా హాజరైన విజయలతరెడ్డితో అధ్యాపకులు

ఘట్‌కేసర్: విద్యార్థులు తమ నెట్‌వర్క్‌ను మెరుగుపర్చుకోవాలని హైదరాబాద్ ఐఈఈఈ చైర్ ప్రొఫెసర్ విజయలతరెడ్డి అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఐఈఈఈ- ఎస్ఎస్ఐటీ(సొసైటీ ఆన్ సోషల్ ఇంప్లికేషన్స్ ఆఫ్ టెక్నాలజీ) ఆధ్వర్యంలో గురువారం విద్యార్థుల సదస్సుకు అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ ప్రదేశాల్లో జరుగుతున్న సదస్సులకు హాజరై పేపర్ ప్రెజెంటేషన్ చేయాలని అన్నారు. కార్యక్రమంలో డీన్ విజయకుమార్, ఎస్ఓఈ బ్రాంచ్ కౌన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత్‌రావు, డీన్ కేఎస్ రెడ్డి, అధ్యాపక సమన్వయకర్త ఆనంద్‌బాబు, వందలాదిగా విద్యార్థులు పాల్గొన్నారు.

ఐరోపాలో విద్య, ఉద్యోగ అవకాశాలు



డోవిల్ జోడెనైట్, జాలియస్ క్రిస్కెవిసియస్

ఘట్‌కేసర్: ఐరోపాలో విద్య, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ మల్లాది రమాకాంత్‌రెడ్డి అన్నారు. విద్యార్థులు ఐరోపాలో విద్య, ఉద్యోగ అవకాశాలపై సమగ్ర సమాచారం అందించేందుకు వాల్మీకి ఫారిన్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ సహకారంతో ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కొండాపూర్ సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం అవగాహన కల్పించారు. ఇంటర్నేషనల్ స్టడీస్ సెంటర్ గౌరవ సంచాలకుడు డోవిల్ జోడెనైట్, లిథువేనియాలోని విల్నియస్ టెక్ విశ్వవిద్యాలయానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ జాలియస్ క్రిస్కెవిసియస్ హాజరయ్యారు. విదేశాల్లో మాస్టర్స్ ప్రోగ్రామ్ అభ్యాసంతో కలిగే ప్రయోజనాలు, యూరప్‌లో అందుబాటులో ఉన్న విభిన్న అకడామిక్ ఆఫర్లు, అంతర్జాతీయ గ్రాడ్యుయేట్ల కెరీర్ అవకాశాలు, లిథివేనియాలోని ప్రసిద్ధ ప్రభుత్వ సంస్థ విల్నియస్ టెక్ విశ్వవిద్యాలయంలో అవకాశాల గురించి వివరించారు.

బీజేపీతోనే దేశ ఉజ్వల భవిష్యత్తు

మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్

ఉప్పల్: దేశ ఉజ్వల భవిష్యత్ బీజేపీతోనే సాధ్యమవుతుందని, ప్రధాని నరేంద్ర మోదీ వల్లే దేశంలో వెలుగులు నిండాయని మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం రాత్రి చిలుకానగర్ డివిజన్‌లో ఆయన మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, నియోజకవర్గ బాధ్యులు దేవసాని బాలచందర్, నాయకులు, నేతలు, కార్యకర్తలతో కలిసి రోడ్ షో నిర్వహించారు. ఉప్పల్ పిస్తాహౌజ్ నుంచి చిలుకానగర్ వరకు చేరుకున్న రోడ్ షో అనంతరం ఆయన మాట్లాడారు. దేశం సుభిక్షంగా ఉండాలంటే కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు. దేశవ్యాప్తంగా నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి కావాలని బలంగా కోరుకుంటున్నారన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తు లేదని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయ్యే అవకాశమే లేదన్నారు. ఇప్పటికే ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు చెప్పి గెలిచిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను మర్చిపోయాడని, మూడు నెలల్లోనే రేవంత్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. మల్కాజిగిరి ఓటర్లు ఎంతో విజ్ఞులని, ఈసారి తనకు అవకాశం కల్పించాలని కోరారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గాన్ని తెలంగాణలోనే ఉన్నత స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి మల్కాజిగిరిలో ఓటు అడిగే నైతిక హక్కు లేదని విమర్శించారు. గతంలో రేవంత్‌రెడ్డిని ఇక్కడి ప్రజలు గెలిపిస్తే ఒక్కసారి కూడా కన్నెత్తి చూడలేదని, కనీసం కరోనా కష్టకాలంలో కూడా ఇక్కడి ప్రజలను పట్టించుకోలేదని విమర్శించారు. దేశంలో కాంగ్రెస్, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీల పని అయిపోయిందన్నారు. మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

మీడియా అక్షరాస్యత-తప్పుడు సమాచారంపై వర్క్‌షాప్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎడిటర్ సుధాకర్‌రెడ్డి

ఘట్‌కేసర్: అంకుషాపూర్‌లోని బుద్వెల్ గురుకుల్ మహిళా డిగ్రీ కళాశాలలో మీడియా అక్షరాస్యత-తప్పుడు సమాచారంపై అమెరికన్ కార్నర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో గురువారం ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టైమ్స్ ఆఫ్ ఇండియా ఇన్వెస్టిగేషన్ ఎడిటర్ సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ యుగంలో తప్పుడు సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతోందన్నారు. ఇటువంటి వర్క్‌షాప్‌లు విద్యార్థులను బాధ్యతాయుతంగా సమాచార సముద్రంలో నావిగేట్ చేయడానికి అవసరమైన సాధనాలతో సన్నద్ధం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. కార్యక్రమంలో జర్నలిస్ట్ సత్యప్రియ, ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి, హెల్త్‌సిటీ చైర్మన్ భద్రారెడ్డి

ఘట్‌కేసర్: పట్టణంలోని బైపాస్ చౌరస్తాలో మల్లారెడ్డి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా మల్లారెడ్డి హెల్త్‌సిటీ చామకూర భద్రారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి హాజరై చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదటి రోజు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, బీఆర్‌ఎస్ మున్సిపల్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమేష్, శ్రీనివాస్‌గౌడ్, కొండల్‌రెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ ధర్మారెడ్డి, మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు ఆంజనేయులుయాదవ్, వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచులు శివశంకర్, వెంకటేశ్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, సంజీవముదిరాజ్, ప్రణయ్‌రెడ్డి, మల్లికార్జున్ రాజు, మహేశ్, సుధాకర్, యాదగిరి పాల్గొన్నారు.

బిట్స్ పిలానీతో సీఆర్‌పీఎఫ్ అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలను అందుకుంటున్న సీఆర్‌పీఎఫ్ ఐజీ చారు సిన్హా, బిట్స్ ఫిలానీ డైరెక్టర్ సామ్యో ముఖర్జి

జవహర్‌నగర్: జూబ్లిహిల్స్‌లోని ఐజీ సౌతెర్న్ సెక్టార్‌లో గురువారం దివ్యాంగ్ వారియర్స్‌కు నైపుణ్య శిక్షణ అందించేందుకు బిట్స్ పిలానీ, సీఆర్‌పీఎఫ్ మధ్య ఒప్పంద కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఆర్‌పీఎఫ్ ఐజీ చారు సిన్హా ఐపీఎస్, బిట్స్ ఫిలానీ డైరెక్టర్ సామ్యో ముఖర్జి హాజరై ఒప్పంద పత్రం (మెమోరాండమ్ ఆఫ్ అండర్ స్టాండింగ్ -ఎంవోయూ)పై సంతకం చేశారు. ఈ సందర్భంగా బిట్స్ పిలానీ డైరెక్టర్ సామ్యో ముఖర్జి హాజరై మాట్లాడుతూ.. బిట్స్ పిలానీ ఉత్తమ నైపుణ్య శిక్షణకు నాందిగా నిలుస్తుందన్నారు. దివ్యాంగ్ వారియర్స్‌కు విలువలతో కూడిన అభ్యాసాలను అందచేస్తామన్నారు. అత్యాధునిక ప్రమాణాలతో కూడిన నైపుణ్య శిక్షణను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ డీఐజీ అనిల్‌మింజ్, బిట్స్ ఫిలానీ డీన్ యోగేశ్వరి, సీఆర్‌పీఎఫ్, బిట్స్ ఫిలానీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి యువకుడి మృతి



అర్బాజ్ అలీ (ఫైల్)

ఘట్‌కేసర్: చేపలు పట్టేందుకు వెళ్లి ఓ యువకుడు మృతి చెందిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అంబర్‌పేటకు చెందిన మహ్మద్ గౌస్ పాషా, అతడి భార్య, కుమారుడు మహ్మద్ అర్బాజ్ అలీ(20) కలిసి ఈ నెల 2న అవుషాపూర్‌లోని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు వచ్చారు. ప్రార్థనలు చేసిన తర్వాత అర్బాజ్ అలీ తన తల్లిదండ్రులకు చెప్పకుండా ఎదులాబాద్‌లోని లక్ష్మీనారాయణ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. అతడి కోసం తల్లిదండ్రులు ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం మధ్యాహ్నం చెరువులో మృతదేహాన్ని గమనించిన గొర్రెల కాపరి పోలీసులకు సమాచారం అందజేశాడు. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి తండ్రికి సమాచారం అందించారు. కుమారుడి మృతదేహాన్ని చూసిన తండ్రి బోరున విలపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోల్కమ్మకుంటలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ పోల్కమ్మకుంట బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని కండ్లకోయకు చెందిన పలువురు తహసీల్దార్ శైలజకు ఫిర్యాదు చేశారు. కుంట పరిధిలో ఉన్న బఫర్ జోన్‌ను అక్రమంగా కబ్జాలు చేయాలని ప్రయత్నాలు చేస్తూ నిర్మాణాలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ చేసి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అద్దంకి దయాకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు



మేడ్చల్: మాలమహానాడు అధ్యక్షుడు టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్‌ను మేడ్చల్ నేతలు కలిసి సన్మానించారు. ఆయన జన్మదినం సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ మండల నాయకుడు బేరీ ఈశ్వర్, బీఆర్‌ఎస్ కౌన్సిలర్ దేవ, నాయకులు మహేష్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ఘట్‌కేసర్‌లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్



ఘట్‌కేసర్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అంబేడ్కర్ నగర్‌లో సీఐ సైదులు ఆధ్వర్యంలో గురువారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రజలందరూ సహకరించాలని, ప్రలోభాలకు లొంగకుండా ఓటును వినియోగించుకోవాలని ప్రజలకు వివరించారు. ఎన్నికల నిబంధనలకు వ్యతిరేక వ్యవహరించే వారి గురించి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సైలు రామునాయక్, అశోక్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వృద్ధుడి అదృశ్యం



ఇక్బాల్(ఫైల్)

జవహర్‌నగర్: మతిస్థిమితం లేని వృద్ధుడు అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాప్రాల్‌లోని సాయి ఎన్‌క్లేవ్‌లో మహ్మద్ ఇక్బాల్(70) కుటుంబ సభ్యులతో నివసిస్తున్నారు. ఇక్బాల్ మతిమరుపు, ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. గత నెల 31వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఇక్బాల్ ఇంతవరకు తిరిగిరాలేదు. దీంతో అతడి ఆచూకీ కోసం తెలిసిన చోట్ల వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



మేడ్చల్‌రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ కళాశాలలో వార్షిక క్రీడా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొనగా యాజమాన్యం బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరకంగా, మానసికంగా దృఢంగా మారుతారని, ఆరోగ్యకరంగా ఉండవచ్చన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు నిత్యం సాయంత్రం వేళలో ఆటల్లో పాల్గొనాలని కోరారు. క్రీడల్లో పాల్గొనే వారికి కళాశాలలో క్రీడా మైదానం, టెన్నిస్, బ్యాడ్మింటన్ వంటి పలు కోర్టులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు అనురాగ్‌రెడ్డి, సరోజారెడ్డి, పీడీ రత్నకుమార్, కో ఆర్డినేటర్ భాస్కర్‌రెడ్డి, పీఆర్వో రవిసుధాకర్, డీన్ లక్ష్మీదేవి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలి



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ సాదిక్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ మోహన్‌రావుకాలనీలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ సాదిక్ ఆధ్వర్యంలో మహ్మద్ చోటా కరీం సహకారంతో గురువారం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని మతాల పండగలకు ప్రాధాన్యం ఇచ్చేదన్నారు. ప్రజలందరిపై అల్లా దీవెనలు ఉండాలన్నారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. రంజాన్, ఉగాది పండగల సందర్భంగా షర్మిల చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు టి.షర్మిల ఆధ్వర్యంలో గురువారం జవహర్‌నగర్‌లో నిత్యావసర సరుకులు, పండ్లు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దక్షిణ భారతదేశ రాజకీయ సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు మహమ్మద్ రషీద్ ద్రావిడ, టి.కాలేష, ఎండీ.వహీద్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



షర్మిల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ